ఈనాడు
విజయనగరం


పండగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎఫ్‌వో త్రినాథరావు

ఉత్సవాలకు ఏర్పాట్లు వేగవంతం

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఉత్సవాల నిర్వహణ ముఖ్య అధికారి, సింహాచలం దేవస్థానం ప్రాంతీయ సంయుక్త కమిషనర్ వి. త్రినాథరావు ఆదేశించారు. శుక్రవారం నగరంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎక్కడికక్కడే తాగునీరు, ఉచిత ప్రసాదాలు పెట్టాలని, క్యూలైన్ల వద్ద నీడ ఉండేలా చూడాలని సూచించారు.

పైడితల్లి సేవలో అశోక్

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: పూసపాటి వంశీయుల ఆడపడుచు పైడితల్లిని దేవస్థానం అనువంశిక ధర్మకర్త, మాన్సాస్ ఛైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు, అతని భార్య సునీల గజపతి రాజు శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలు, వేదపండితుల వేదమంత్రాల నడుమ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం దేవస్థానం సహాయ కమిషనర్ ప్రసాదరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.


అశోక్ గజపతిరాజు దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఏసీ ప్రసాదరావు

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

అధ్యాపకులు లేకపోతే నాణ్యమైన విద్యాబోధన వీలుపడదు. అందువల్ల విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఖాళీల భర్తీకి ప్రకటన ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. గత కొన్నేళ్లుగా ఉన్న ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఇటీవల నిర్వహించిన ఉన్నత విద్య సమీక్షలో సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకున్న ఏకైక విశ్వవిద్యాలయమైన జేఎన్‌టీయూ గురజాడకు మంచి రోజులు రానున్నాయి.

అధ్యాపకులొస్తున్నారండి..!



జేఎన్‌టీయూ గురజాడలో భర్తీకి ఆదేశాలు

విశ్వవిద్యాలయంలో ప్రధానంగా అధ్యాపకుల కొరత తీరనుంది. ఉపకులపతి (వీసీ) రానున్నారు. వీసీ నియామకానికి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. జేఎన్‌టీయూ నుంచి ఇద్దరికి అర్హత ఉన్నట్లు ఆయా వర్గాలు పేర్కొంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అధ్యాపకుల కొరతతో నాక్, ఎన్‌బీఏ (కొన్ని బ్రాంచిలకే ఉంది) గుర్తింపు లేకపోవడంతో ఎన్ఆర్ఐఎఫ్ ర్యాంకింగ్‌లో విశ్వవిద్యాలయం చోటు దక్కించుకోలేకపోయింది. ప్రాంగణ నియామకాలు సైతం తగ్గుముఖం పట్టాయి. 2021-22లో 265 మందికి అవకాశాలు లభిస్తే, 2022-23లో ఆ సంఖ్య 180కి పడిపోయింది. 2023-24లో 130 మంది మాత్రమే కొలువులు సాధించారు. ఈక్రమంలో గతేడాది ఇంజినీరింగ్‌లో మంచి ర్యాంకులు సాధించిన కొందరు అభ్యర్థులు సైతం ఇక్కడ ప్రవేశాలకు విముఖత చూపారు.

పరిస్థితి ఇదీ..

★ 2007లో కాకినాడ విశ్వవిద్యాలయం ప్రాంగణంగా ఏర్పాటై, గత ప్రభుత్వంలో 2022లో విశ్వవిద్యాలయం హోదా దక్కించుకుంది.

★ ప్రారంభంలో ఇంజినీరింగ్ కళాశాలగా ఉన్న సమయంలో ఇక్కడ 41 మంది బోధకులు ఉండేవారు. 2012లో 21 మందిని నరసరావుపేట, కాకినాడ విద్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపించారు. వీరంతా విభజన తర్వాత అక్కడే ఉండిపోయారు. కొందరు ఐచ్ఛికం ఇచ్చి కాకినాడకు వెళ్లిపోయారు.

★ ప్రస్తుతం 22 మంది పని చేస్తున్నారు. ఇందులో 18 మందే ఇక్కడివారు. మిగిలిన వారు కాకినాడకు వెళ్లాల్సిన వారే. బోధనకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు కొనసాగిస్తున్నారు. అక్కడి నుంచే వీరికి జీతాలు చెల్లిస్తున్నారు. వీరు కాకుండా తాత్కాలిక ప్రాతిపదికన 51 మంది, పీరియడ్ల ఆధారంగా మరో అయిదుగురు ఉన్నారు.

ప్రకటన ఇచ్చినా..

జేఎన్‌టీయూ, కురుపాం ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆచార్యులు, అసోసియేట్ ఆచార్యులు, సహాయ ఆచార్యులు మూడు విభాగాల్లో 135 పోస్టులకు 2023 అక్టోబరు 30న ప్రకటన వెలువడింది. 141 పోస్టులకు నియామకాలు చేపట్టాల్సి ఉండగా, డిప్యుటేషన్‌పై వెళ్లిన వారిని మినహాయించారు. మరోవైపు ఉద్యోగ ప్రకటన, రిజర్వేషన్ల ఖరారుపై న్యాయస్థానంలో వ్యాజ్యం దాఖలైన నేపథ్యంలో కేవలం దరఖాస్తులనే స్వీకరించాలని, ప్రొవిజల్ జాబితా జారీ ప్రక్రియను చేపట్టవద్దని హైకోర్టు ఆదేశించింది. కురుపాం ఇంజినీరింగ్ కళాశాలలో తరగతులు ప్రారంభం కాకపోయినా పోస్టులు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ప్రక్రియ ఆగిపోయింది. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం నుంచి కొత్త ప్రకటన రానుందని ఇన్‌ఛార్జి ఉపకులపతి **డి.రాజేశ్వరి** తెలిపారు. వీసీ, ఆచార్యులు వస్తే ఇబ్బందులు ఉండవు.



బొబ్బిలికి సాలూరు రైలొచ్చింది

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి - సాలూరు మధ్య నడిచే రైలు బస్సు సేవలను కరోనా నుంచి నిలిపేశారు. ఆ స్థానంలో మెము నడపనున్నట్లు ఇది వరకే రైల్వేశాఖ ప్రకటించింది. ఎట్టకేలకు శుక్రవారం ట్రైల్ రన్ చేపట్టారు. రైలు విశాఖ నుంచి బొబ్బిలి 12:30 గంటలకు చేరుకుంది. అక్కడి నుంచి సాలూరు వెళ్లి తిరిగి బొబ్బిలికి 1:50 గంటలకు చేరుకుంది.



9న సామూహిక అక్షరాభ్యాసాలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో ఈనెల 9న మూలా నక్షత్రం సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, జి.శ్రీనివాసరావు తెలిపారు. 3 వేల మంది చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు రానున్నట్లు చెప్పారు. భక్తులకు ఉదయం ఫలహారం, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వారధికి శ్రీకారం

ఏళ్ల నాటి సమస్యకు మోక్షం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాలకు ప్రధానమైన పారాది కొత్త వంతెన నిర్మాణానికి బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఏళ్లుగా ఎదురు చూస్తున్న బొబ్బిలి ప్రజల కల నెరవేరనుందన్నారు. 1934లో పాత వంతెనను అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసిన తన తాత రామకృష్ణరంగారావు బహుదూర్ హయాంలో నిర్మించారని, 90 ఏళ్ల పాటు వాహనాల రాకపోకలు సాగించాయన్నారు. గత తెదేపా హయాంలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు హయాంలో వంతెన మంజూరు చేస్తే తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్మాణం చేపట్టకుండా వదిలేసిందన్నారు. రెండేళ్ల కిందట పాత వంతెన కుంగిపోవడంతో మరమ్మతులు చేసి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.13.40 కోట్లతో చేపట్టనున్న వంతెన పనులను గడువులోగా పూర్తి చేయాలని, అందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు ఎ.భాస్కరరావు, నానీశ్వరి, ఉమ, డీఈ జనార్దనరావు, ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.


స్తంభం నిర్మాణానికి సిమెంటు వేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పీఎం కిసాన్ సాయం రూ.37.08 కోట్లు

వ్యవసాయ విభాగం, రాజాం, న్యూస్‌టుడే: పీఎం కిసాన్ కింద 18వ విడత నిధులు శనివారం నేరుగా రైతు ఖాతాల్లోకి జమ కానున్నాయి. జిల్లాలో 1.85 లక్షల మందికి రూ.37.08 కోట్లు అందనున్నాయని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.

అందుబాటులో ఇసుక

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇసుక కొరతను అధిగమించేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం బొబ్బిలి నిల్వ కేంద్రంలో మాత్రమే అందుబాటులో ఉంది. ఆరు నెలలకు సరిపడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రీచ్‌ల గుర్తింపు, తవ్వకాలు, నిల్వ కేంద్రాలు పెంచేందుకు సన్నద్ధమయ్యారు. అందులో భాగంగా వంగర మండలం చాకరాపల్లి వద్ద లభ్యమయ్యే 75 వేల టన్నుల ఇసుకలో 45 వేల టన్నులను బొబ్బిలి నిల్వ కేంద్రానికి తరలించనున్నారు. మిగిలిన 30 వేల టన్నులను కొత్తగా ఏర్పాటు చేయనున్న చీపురుపల్లి కేంద్రంలో అందుబాటులో ఉంచనున్నారు. తెర్లాం మండలం కుసుమూరు, సంతకవిటి మండలం తమరాడలో గుర్తించిన రీచ్‌ల వద్ద తవ్వకాలు చేపట్టనున్నారు. రేగిడి ఆమదాలవలస మండలం పొర్లి వద్ద అందుబాటులో ఉన్న రీచ్‌ను తనిఖీ చేసి, తవ్వకాలకు ఏర్పాట్లు చేయనున్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా: కలెక్టర్

రీచ్‌ల వద్ద సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. రవాణాకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలను మాత్రమే అనుమతించాలన్నారు. బుక్ చేసుకున్న ఇసుకకు సరిపడా వాహనాన్ని మాత్రమే తీసుకురావాలని.. ఈ మేరకు యాప్‌లో మార్పులు చేయాలని సూచించారు. అందులో భాగంగా లభ్యత, జిల్లా అవసరాలు, నిల్వ కేంద్రాలు, కొత్త రీచ్‌లు తదితర అంశాలపై తన ఛాంబర్లో శుక్రవారం జిల్లాస్థాయి అధికారులతో సమావేశమై ఆదేశాలు జారీ చేశారు.

కిలో కందిపప్పు రూ.67కే

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: చౌక దుకాణాల ద్వారా కిలో కందిపప్పు రూ.67కే అందించనున్నారు. అక్టోబరు నెలకు సంబంధించి జిల్లాకు 260 టన్నులు కేటాయించారు. ఇప్పటి వరకు 65 టన్నులు వచ్చిందని, మిగిలిన సరకు శుక్రవారం రాత్రి చేరిందని జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు తెలిపారు.



వేంకటేశ్వరునికి పూజలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ చేపట్టారు. ఉదయం గరుడ పటాన్ని ధ్వజ స్తంభంపై ఎగురవేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించారు. ఈవో శ్రీనివాసరావు పర్యవేక్షించారు.


– న్యూస్‌టుడే, నెల్లిమర్ల

దిల్లీకి వెళ్లారు.. ఇన్‌స్పైర్ చేశారు

పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ ఓ విద్యార్థిని తయారు చేసిన వస్తువులు ఆలోచింపజేయగా.. వివిధ రకాల పనులు చేసేలా ఓ పరికరాన్ని రూపొందించి ఔరా అనిపించింది మరో బాలిక. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ముందుకెళ్తూ, పలు ప్రాంతాల్లో జరిగిన ప్రదర్శనల్లో సత్తా చాటుతూ చివరకు దిల్లీ చేరుకున్నారు. ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో తాము తయారు చేసిన వాటిని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అవేంటో మీరూ చూసేయండి..

అరటి దవ్వలతో బ్యాగులు..

ఎల్.కోట మండలం జమ్మాదేవిపేట సమీపంలోని జ్యోతిబాపులే వెనుకబడిన తరగతుల బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పూజిత అరటిదవ్వలను ఉపయోగించి జియో బ్యాగుల తయారీకి ముందడుగు వేసింది. గైడ్ ఉపాధ్యాయురాలు ఇంద్రజ సహకారంతో రూపొందించింది. దీనికి పెద్దగా ఖర్చు ఉండదు. అరటిగెల పండిన తరువాత చెట్టు కొట్టేస్తారు. దానిలోని పిలకను తీసుకుని దానిని ముక్కలుగా కోసి, గ్రైండర్‌లో ఆడించాలి. ఆ ముద్దను పొడిదుస్తులపై ఎండలో ఆరబెట్టి, అనంతరం బ్యాగులను తయారు చేస్తోంది. ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడే ఈ ఆలోచన వచ్చిందని, ప్రిన్సిపల్ యూవీకే.పాత్రో, ఉపాధ్యాయురాలు ఇంద్రజ ప్రోత్సాహంతో ముందుకెళ్తున్నట్లు బాలిక చెబుతోంది. ఇప్పటికే టోక్యోలో అంతర్జాతీయ ప్రదర్శనకు తన ప్రాజెక్టు ఎంపికైందని, ఇటీవల దిల్లీలో జరిగిన జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో సైతం పాల్గొన్నట్లు పేర్కొంది.



జియో బ్యాగులు



గైడ్ ఉపాధ్యాయిని ఇంద్రజతో పూజిత

బహుళ ప్రయోజన పరికరం

ఉపాధ్యాయినికి వచ్చిన ఆలోచనను ఆచరణలో పెట్టి జాతీయస్థాయిలో ప్రశంసలు దక్కించుకుంది సంకిలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బైరి హరిత. తొమ్మిదో తరగతి చదువుతున్న ఈ బాలిక బహుళ ప్రయోజన పరికరాన్ని తయారు చేసింది. భౌతికశాస్త్ర ఉపాధ్యాయిని కె.ప్రవీణాలత సహకారంతో పాత ఇనుప పరికరాలతో రూ.1000 ఖర్చుతో రూపొందించి. దీనిని సుత్తి, గొడ్డలి, రెంచీ, స్క్రూడ్రైవర్ తదితరాలుగా వినియోగించుకోవచ్చు. రాష్ట్రస్థాయిలో కడప జిల్లాలో 2019లో ప్రదర్శించామని, ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రశంసలు దక్కాయని హరిత చెబుతోంది. గతంలో బహుళ వినియోగ వ్యవసాయ పరికరం, ఆపరేషన్ బెడ్ వంటి ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి వెళ్లాయని గుర్తు చేసింది.





దేశ రాజధానిలో జరిగిన పోటీల్లో ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న హరిత

– న్యూస్‌టుడే, లక్కవరపుకోట, రేగిడి

గిరిజన గూడేల్లోకి గజరాజులు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలంలోకి ప్రవేశించిన ఏనుగులు గిరిజన గూడేల్లోకి వెళ్లి పంటలు, తోటలను ధ్వంసం చేస్తున్నాయి. శుక్రవారం సీతంపేట మార్గంలో ఆరు ఎకరాలకు పైగా పంటలను తొక్కేశాయి. తర్వాత సమీపంలోని పామాయిల్ తోటలో తిష్ఠవేశాయి. తొలిసారి ఈ గ్రామాల వైపు గజరాజులు రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కోరి, పనసభద్ర, తొక్కుడువలస, తాన్నవలస, సీతంపేట, రంగలగూడ మధ్య సంచరిస్తుండటంతో ఎవరూ బయటకు వెళ్లేందుకు సాహసించడం లేదు. రేంజర్ మణికం రేష్ నేతృత్వంలో ట్రాక్టర్లు పర్యవేక్షిస్తున్నారు.



సీతంపేట మార్గంలో దెబ్బతిన్న వరి

నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి రింగురోడ్డు సమీపంలోని మాంసం దుకాణానికి వెళ్లి మూడు కిలోలు కొన్నారు. తూకం తేడా కనిపించడంతో పక్కనే ఉన్న మరో దుకాణానికి వెళ్లగా.. రెండున్నర కిలోలే వచ్చింది. తిరిగి వెళ్లి అడిగితే దుకాణ యజమాని వాగ్వాదానికి దిగాడు.

నగరానికి చెందిన ఓ వ్యక్తి లీటరు పాల ప్యాకెట్లను రెండు కొన్నారు. ముద్రించిన ధర కన్నా అదనంగా రూ.4 తీసుకున్నారు. ప్రశ్నించగా.. అలా అమ్మితేనే తమకు గిట్టుబాటు అవుతుందని వ్యాపారుస్థుడు చెప్పుకొచ్చాడు. బొబ్బిలి, గంట్యాడలోనూ అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

అడిగినంత కాదు.. ఇచ్చినంత తీసుకోండి

- తూకాల్లో తేడాలపై పెద్దఎత్తున కేసులు
- తనిఖీలు అంతంత మాత్రమే



తూకపు రాళ్ల బరువులు చూస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

ఉమ్మడి జిల్లాలో నిత్యం మార్కెట్లో వినియోగదారులకు ఎదురవుతున్న సమస్యలివి. తూకాల్లో లోపాలు, అధిక ధరలకు అమ్మకాలతో ఫిర్యాదులు పెరుగుతున్నాయి. చిన్నపాటి దుకాణాల నుంచి పెద్దపెద్ద మార్టుల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కొందరు అధికారులకు ఫిర్యాదు చేస్తుండగా.. మరికొందరు తమకెందుకని మిన్నకుండిపోతున్నారు. ఈక్రమంలో అక్రమాలు పెరుగుతునాయి.


ఇవి చూడాల్సిందే.. ● తూకాన్ని తప్పనిసరిగా గమనించాలి ● బిల్లు తీసుకోవాలి ● దానిపై ఉన్న ధరకు.. వస్తువుపై ఉన్నదానిని సరిపోల్చాలి ● ఇంటికి వెళ్లి సరకు నాణ్యతను చూసుకోవాలి ● తయారీ, వినియోగపు తేదీలున్న వాటినే కొనాలి ● తూనికల అడుగు భాగాన లీగల్ మెట్రాలజీ అధికారుల ముద్ర పరిశీలన తప్పనిసరి

ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు

జిల్లా	కేసులు	జరిమానాలు(రూ.లక్షల్లో) ముద్రణ	అపరాధ
విజయనగరం	91	16.26	6.53
పార్వతీపురం మన్యం	23	3.75	1.30

సంప్రదించాల్సిన చరవాణి నంబర్లు

అసిస్టెంటు కంట్రోలర్	: 99516 86789
విజయనగరం ఇన్‌స్పెక్టర్	: 90008 28467
బొబ్బిలి ఇన్‌స్పెక్టర్	: 93981 31790
పార్వతీపురం మన్యం	: 94419 62429
టోల్ ఫ్రీ నంబరు	: 18004254202



తనిఖీలు ఇలా.. తూకం రాళ్లు, ఎలక్ట్రానిక్ కాటాలకు సీళ్లు వేయడం, ప్యాకెట్లు, సీసాలపై ముద్రించిన ధరలకు విక్రయించేలా చూడటం, వివరాలు, చిరునామా కనిపించకపోతే జరిమానాలు విధించడం

సిబ్బంది కొరత..

వాస్తవానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యాపార సముదాయాలకు తగ్గట్టుగా తూనికల కొలతల శాఖలో సిబ్బంది లేరు. కేవలం ఇన్‌స్పెక్టర్లతోనే నెట్టుకొస్తున్నారు. ఆకస్మిక తనిఖీలకు వెళ్లేటప్పుడు సంబంధిత వ్యాపారస్థుల నుంచి ప్రతిఘటన ఎదురైతే ఎదుర్కొనే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ప్రస్తుతానికి రెండు జిల్లాల పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఒక జిల్లా అధికారి ఉన్నారు. కింది స్థాయి సిబ్బంది పది మంది కూడా లేరు.

అప్రమత్తత అవసరం..

వినియోగదారులు అప్రమత్తంగా ఉంటే మోసాలను అరికట్టవచ్చు. ఎలాంటి లోపాలు కనిపించినా మా దృష్టికి తీసుకురావొచ్చు. సిబ్బంది తక్కువగా ఉన్నా విధి నిర్వహణలో రాజీ పడడం లేదు. తరచూ దాడులు చేస్తున్నాం. పెద్దఎత్తున కేసులు నమోదు చేస్తున్నాం.

– రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్, తూనికలు– కొలతల శాఖ, విజయనగరం

మన్యంలో మండలానికో ఆదర్శ వన్‌దన్ కేంద్రం

పార్వతీపురం, న్యూస్‌టుడే: మన్యం జిల్లాలో మండలానికి ఒక వనదన్ వికాస కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది, గిరిజన ప్రగతికి నమూనాగా నిలిచేలా చేయాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ సూచించారు. శుక్రవారం వీడీవీకేల పనితీరుపై ఐటీడీఏ ఏపీవోలు, డీఆర్‌డీఏ పీడీలతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. గిరిజనులు సేకరించే ఉత్పత్తులకు విలువ జోడించి, వినియోగదారులను ఆకర్షించే స్థాయిలో మార్కెటింగ్ చేయించాలన్నారు. సమావేశంలో సీతంపేట, పార్వతీపురం ఏపీవోలు చినబాబు, మురళీధర్, పీడీ సత్యంనాయుడు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

స్వచ్ఛమైన నెయ్యి కొనుగోలు చేయాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: తితిదే నేరుగా రైతుల నుంచి స్వచ్ఛమైన నెయ్యి కొనుగోలు చేయాలని సుభాష్ పాలేకర్ కృషి(ఎస్‌పీకే) విధాన సాధకుడు విజయరాయ్ కోరారు. శుక్రవారం బొబ్బిలిలో జరిగిన యువ రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. 35 లీటర్ల పాలకు కిలో నెయ్యి వస్తుందని, ఈ లెక్కన కిలో రూ.2 వేలు పడుతోందని చెప్పారు. తితిదే రూ.500, మిగిలిన రూ.1500 సీఎస్ఆర్ నిధి కింద భరిస్తే అన్నదాతకు లబ్ధి కలుగుతుందన్నారు. విదేశాల్లో స్థిరపడ్డ చాలామంది గోవులు కొనుగోలుకు కావాల్సిన నిధులు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నారని, జిల్లాల వారీ ప్రవాసాంధ్రులను గుర్తించి ఆ ప్రాంత రైతులకు గోవులు సమకూరేలా చూడాలన్నారు. ఇలా అయితే రాష్ట్రంలో 5 వేల గోవులు సమకూరుతాయని, రోజుకు మూడు టన్నుల నెయ్యి సరఫరా చేసే అవకాశం లభిస్తుందని చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో గోవుల సంరక్షణ శాలల నిర్మాణానికి 10 ఎకరాల స్థలం సేకరించే పనిలో ఉన్నామన్నారు. ఎమ్మెల్యే బేబినాయన స్థల సేకరణకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.



మాట్లాడుతున్న విజయరాయ్

చేయూత కార్యక్రమం అభినందనీయం

నేరవార్తా విభాగం: పోలీసు శాఖలో పనిచేసి మరణించిన వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు తోటి ఉద్యోగులు ప్రారంభించిన 'చేయూత' కార్యక్రమం ఎంతో గొప్పదని, అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. రేగిడి ఆమదాలవలస పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన పి.నారాయణరావు ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించారు. వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు 'చేయూత' కింద పోలీసు సిబ్బంది పోగుచేసిన రూ.1,49,000ను చెక్కు రూపంలో ఆయన సతీమణి పి.పార్వతమ్మకు శుక్రవారం తన కార్యాలయంలో అందజేశారు. పోలీసు కార్యాలయ సూపరింటెండెంటు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

పంచాయతీ అధికారి బాధ్యతల స్వీకరణ

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారిగా టి.వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లాలో డీపీవోగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ జడ్పీ సీఈవోగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటేశ్వరరావు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

మేమేం చేశాము.. పాపం

చిన్నారులకు విషమిచ్చిన తల్లి

గుమ్మలక్ష్మీపురం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబంలో తలెత్తిన వివాదాలు అభంశుభం తెలియని చిన్నారుల పాలిట శాపంగా మారాయి. తల్లిదండ్రుల మధ్య మనస్పర్థలు పిల్లల ప్రాణాల మీదకు వచ్చాయి. కురుపాం మండలంలో జరిగిన ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. కురుపాం మండలం లంకాజోడుకు చెందిన బిడ్డిక రమేష్, రమ్య ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఆర్యన్ (5), ఆరోహి (6 నెలలు) ఇద్దరు పిల్లలున్నారు. చిన్నారుల తల్లి రమ్య వివరాల మేరకు.. రమేష్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. తన సోదరితో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో నిలదీశానని, ఆరు నెలలుగా గొడవలు జరుగుతున్నాయని తెలిపింది. చనిపోవాలని నిర్ణయించుకొని ఇద్దరు పిల్లలకి పురుగు మందు ఇచ్చానని, తాను తాగేలోపు కుటుంబ సభ్యులు చూసి అడ్డుకున్నారని వాపోయింది. అస్వస్థతకు గురైన చిన్నారులను భద్రగిరి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. మెరుగైన వైద్యసేవల కోసం పార్వతీపురం తరలించారు. రమ్య మానసిక పరిస్థితి బాగోలేదని భర్త రమేష్ తెలిపాడు.

రూ.62 కోట్లతో జల్‌జీవన్ పనులు

భామిని, న్యూస్‌టుడే: మండలంలో రూ.62 కోట్లతో చేపడుతున్న జల్‌జీవన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూధనరావు శుక్రవారం పరిశీలించారు. ఏబీ రహదారి పక్కన నుంచి పైపులైన్లు వేశారు. నేరడి(బి) గ్రామం వద్ద రక్షిత పథకం పనులు ప్రారంభించామని ఏఈ సందీప్ వివరించారు. బురుజోల కొండ వద్ద మెగా రక్షిత పథకం, గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణానికి స్థలాల సేకరణకు సమస్యలున్నాయని, నోటీసులు ఇచ్చామని తహసీల్దార్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో పురోహితుడి మృతి

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఓ పురోహితుడు మృతి చెందిన ఘటన గరుగుబిల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేష్‌నాయుడు వివరాల మేరకు.. జియ్యమ్మవలస మండలంలోని తుంబలివలసకు చెందిన పురోహితుడు ఎం.బాలభాస్కరశర్మ(58) ద్విచక్రవాహనం, చినమేరంగి వైపు వెళ్తున్న కారు తోటపల్లి దేవస్థానం సమీపంలోని కర్రల డిపో వద్ద ఢీకొన్నాయి. ఈ క్రమంలో బాలభాస్కరశర్మకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మర్గమధ్యలో మృతి చెందారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



బాలభాస్కరశర్మ (పాతచిత్రం)

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

బెలగాం, జియ్యమ్మవలస న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంటు సెషన్ జడ్జి ఎస్.అరుణ తీర్పునిచ్చారు. ఎస్సై అనీష్ వివరాల మేరకు 2019లో వ్యక్తిగత కక్షలతో పెదమేరంగి కూడలి వద్ద పి.ధర్మారావుపై అదే గ్రామానికి చెందిన బి.లోకనాథం దాడి చేసి గాయపరిచాడు. కేసు నమోదు చేసి చినమేరంగి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం లోకనాథంకు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై చెప్పారు.

కోనేరులో జారిపడి వృద్ధురాలి మృత్యువాత

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మంచినీటి కోనేరులో ప్రమాదవశాత్తు జారిపడి ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన గంట్యాడ మండలం బుడతనాపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జి.నాగమ్మ(60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె సాయంత్రం వరకు తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం సమీపంలోని కోనేరులో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

రాజాం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి.. కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజాం మండలంలో జరిగింది. సీఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒమ్మి గ్రామానికి చెందిన సీహెచ్.తిరుపతిరావు(45) కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మందు కొనుగోలుకు ఇంట్లో డబ్బులు ఇవ్వకపోవడంతో ఈనెల 3న పొలంలో గడ్డిమందు తాగి ఇంటికి వచ్చాడు. వాంతులు కావడం, అంతలోనే అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం పరిస్థితి విషమించడంతో వైద్యులు సూచనల మేరకు శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశాడు. అతని భార్య మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఏఎస్సై జనార్దనరావు దర్యాప్తు చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు.

మెప్మా బజార్లు వచ్చేశాయ్



మెప్మా బజారు సందర్శిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నగరపాలక సంస్థ కమిషనరు నల్లనయ్య తదితరులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయడమే కాకుండా వారు ఆర్థికంగా ముందడుగు వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మెప్మా అర్బన్ బజార్ల ఏర్పాటుకు ముందుకొచ్చింది. విజయనగరం జిల్లా కేంద్రంలో గురువారం ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కమిషనరు నల్లనయ్య, మెప్మా అధికారులతో కలిసి ప్రారంభించారు. తొలిరోజు రూ.1.50 లక్షల విలువైన ఉత్పత్తులను అమ్మినట్లు ప్రకటించారు. ఇక నుంచి నెలలో రెండు రోజుల పాటు అందుబాటులో ఉండనున్నాయని పేర్కొన్నారు.



స్టాళ్ల వద్ద మహిళలు

మంచి అవకాశం.. నెలలో రెండు సార్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ప్రారంభించాం. ఇకనుంచి వివిధ ప్రాంతాల్లో పెట్టనున్నాం. బ్యాంకుల నుంచి ఒక్కో సంఘం రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకోవచ్చు. ఈ విధానంతో మహిళలు ఆర్థికంగా బలోపేతం కానున్నారు.

– పి.నల్లనయ్య, కమిషనరు, నగర పాలక సంస్థ

అవకాశాలివీ..

నగరపాలిక పరిధిలో 5,386 సంఘాల్లో 56,090 మంది సభ్యులున్నారు. ఈ బజార్లలో స్టాళ్ల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి వీరికి రుణాలు అందజేస్తున్నారు. అల్పాహారం, కిరాణా, డెయిరీ ఉత్పత్తులు, కూరగాయలు, వివిధ రకాల ఆహార పదార్థాలు, పచ్చళ్లు, దుస్తులు, రెడీమేడ్ ఆభరణాలు, చేతివృత్తులకు సంబంధించిన పరికరాలు తదితరాలను ఇక్కడ అమ్ముకోవచ్చు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ బజార్లను పెద్దఎత్తున నడిపించేవారు. అయితే వైకాపా వచ్చాక అన్నింటినీ ఆపేయడం గమనార్హం. కూటమి రాకతో పునరుద్ధరిస్తున్నారు.

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

వరద బాధితులకు ఆర్థిక సాయం

బొబ్బిలి, న్యూస్‌టుడే: విజయవాడ వరదబాధితుల కోసం నియోజకవర్గంలోని పలు గ్రామాల వాసులు ఎమ్మెల్యే బేబి నాయనకు విరాళాలు అందజేస్తున్నారు. బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన తెదేపా నాయకులు శుక్రవారం రూ.73,500 అందజేశారు. తెర్లాం మండలం కొల్లివలస గ్రామస్థులు రూ.27 వేలు, సీతానగరం మండలం బగ్గందొర వలసకు చెందిన బి.శంకరరావు రూ.5 వేలు ఇచ్చారు.


బేబినాయనకు నగదు అందజేస్తున్న గ్రామస్థులు

విజేతలకు ప్రశంసాపత్రాలు


విజేతలతో రోటరీ క్లబ్బు సభ్యులు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం రోటరీ క్లబ్బు జిల్లాస్థాయిలో నిర్వహించిన నవతరోత్సవం టెన్నీకాయిట్ పోటీల్లో చీపురుపల్లి మండలం పెదనడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. బాలికల సీనియర్ విభాగంలో జి.హైమ, బి.గీత.. జూనియర్ విభాగంలో దీపిక, జ్యోత్స్న.. బాలుర జూనియర్ విభాగంలో కె.జస్వంత్, కార్తీక్ పతకాలు సాధించారు. వీరికి రోటరీక్లబ్ గవర్నరు డా.ఎం.వెంకటేశ్వరరావు ప్రశంసాపత్రాలు అందజేసినట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు రామారావు తెలిపారు.

నియంత్రికలు కాలిపోతున్నాయ్.. పంటలు ఎండిపోతున్నాయ్


ఏనుగువలసలో కాలిపోయిన నియంత్రిక

చీపురుపల్లి గ్రామీణ విద్యుత్తు సహకార సంఘం (ఆర్ఈసీఎస్) నిర్వాహణ ఏపీఈపీడీసీఎల్ పరిధిలోకి వెళ్లాక వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు తీవ్ర అవాంతరాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్‌లో వరిపంట పొట్ట దశలో ఉంది. పైరుకు నీరు పెట్టేందుకు పంపుసెట్ల అవసరం పెరిగింది. ఈ సమయంలో నియంత్రికలు ఎక్కువగా దెబ్బతింటున్నాయి. తిరిగి ఏర్పాటు చేయడానికి నెలలు పడుతోంది. దాంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

న్యూస్‌టుడే – గరివిడి, చీపురుపల్లి

ప్రత్యేక లైన్ లేకపోవడంతో

ఆర్ఈసీఎస్‌లో సుమారు 71 వేలు విద్యుత్తు కనెక్షన్లకు ఒకే లైన్ ద్వారా సరఫరా జరుగుతుంది. వ్యవసాయానికి ప్రత్యేక లైన్ లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పరిష్కారానికి సెగ్రికేషన్ ఆఫ్ అగ్రికల్చర్ ఫీడర్స్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిఉన్నా అది జరగలేదు. ప్రత్యేక లైన్ ఏర్పాటుకు నాలుగేళ్ల క్రితం రూ.50.79 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఉపయోగంలేకపోయింది.

ఇదీ పరిస్థితి..

గరివిడి మండలం ఏనుగువలసలో విద్యుత్తు నియంత్రిక కాలిపోయి నెల రోజులు కావస్తున్నా.. కొత్తది ఏర్పాటు చేయలేదని రైతులు అంటున్నారు. సుమారు పది వ్యవసాయ పంపుసెట్లు పనిచేయక 50 ఎకరాల్లో వరిపైరు ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొండపల్లి గ్రామంలోను ఇదే పరిస్థితి. ● బాగువలసలో పాడైన నియంత్రిక మార్చక పంటలు ఎండిపోతున్నాయని అక్కడి రైతులు ఎమ్మెల్యే కళా వెంకటరావు ఎదుట ఇటీవలే మొరపెట్టుకున్నారు. ● మెరకముడిదాం మండలం రామయ్యవలస, కొండలావేరులో విద్యుత్తు నియంత్రిక పాడై పది రోజులవుతున్నా.. అధికారులు స్పందించకపోవడంతో గృహ, వ్యవసాయ వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. సంస్థ పరిధిలో పలు గ్రామాల్లో ఇదే దుస్థితి.

మూడేళ్లుగా ఈపీడీసీఎల్ నిర్వహణలోనే..

ఏపీఈఆర్సీ (రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి) జారీచేసిన ఉత్తర్వుల మేరకు 2021 సెప్టెంబరు 1న ఆర్ఈసీఎస్‌ను ఏపీఈపీడీసీఎల్ స్వాధీనం చేసుకుని నిర్వహిస్తోంది. ప్రతి నెలా రీడింగ్ తీయడం, బిల్లులు వసూళ్లు చేయడం తప్ప మిగతా అంశాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బిల్లుల ద్వారా నెలకు సుమారు రూ.3 కోట్లు ఆదాయం వస్తున్నా.. సమస్యలు పరిష్కారానికి సకాలంలో స్పందించడం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది.

చర్యలు తీసుకుంటున్నాం..

వ్యవసాయ కనెక్షన్లకు నేరుగా విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రత్యేక లైను ఏర్పాటు లేనందున సమస్య ఉంది. విద్యుత్తు నియంత్రికలు ఎక్కువగా దెబ్బతింటున్నాయి. అదనపు నియంత్రికల అవసరం ఉంది. అవసరమైన చోట ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. పాడైపోయిన చోట కొత్తవి వేస్తున్నాం.

– బీవీ రమణ, డిప్యూటీ ఈఈ, ఏపీఈపీడీసీఎల్ చీపురుపల్లి డివిజన్

● వ్యవసాయ విద్యుత్తుకు ఇక్కట్లు

● పరిధిలోని రైతులకు తప్పని అవస్థలు

ఆర్ఈసీఎస్‌లో విద్యుత్తు కనెక్షన్ల వివరాలు..


గృహ వినియోగం	: 55,737
వ్యవసాయం	: 9,334
పారిశ్రామికం	: 615
గృహేతర	: 4,670
పాఠశాలలు, వీధి దీపాలు, ఆర్‌డబ్ల్యూఎస్, ఆలయాలు	: 1,320
మొత్తం	: 71,676

11 కేవీ లైను : 890 కి.మీ ఎల్‌టీ లైను: 2,280 కి.మీ నియంత్రికలు: 1,594

ఏటా విద్యుత్తు బిల్లుల ద్వారా వచ్చే ఆదాయం: రూ.36 కోట్లు

కల్పవల్లి.. భక్తులు ప్రణమిల్లి


బొబ్బిలి: అలజంగిలో సామూహిక కుంకుమ పూజలు


బొబ్బిలి: దాడితల్లి


సంతకవిటి: దురాదేవికి పూజలు చేస్తున్న యువకులు

వాడవాడలా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. చిన్నారులు, పెద్దలతో మండపాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. భవానీ మాలధారులు నిష్ఠతో అమ్మవారికి పూజలు చేస్తున్నారు. శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే, రాజాం, బొబ్బిలి, గ్రామీణం, సంతకవిటి, చీపురుపల్లి, గ్రామీణం, రామభద్రపురం


రాజాంలో..


చీపురుపల్లిలో..


గాయత్రిదేవిగా..


రామభద్రపురంలో..

శాంతియుతంగా మెలగాలి


లక్ష్మింపేటలోని ప్రత్యేక కోర్టును పరిశీలిస్తున్న డీఎస్పీ

వంగర, న్యూస్‌టుడే: ప్రజలు శాంతియుతంగా మెలగాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. శుక్రవారం వంగర మండలం లక్ష్మింపేటను ఆకస్మికంగా సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడారు. పోలీసులు, ప్రజలు సత్సంబంధాలు కలిగివుండి, స్నేహపూర్వకంగా ఉండాలని డీఎస్పీ అన్నారు. లక్ష్మింపేటలో ప్రత్యేక కోర్టు పరిసరాలను పరిశీలించారు. అనంతరం వంగర పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరరావు, ఎస్సై షేక్‌శంకర్ ఉన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై నిఘా

తెర్లాం, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఇప్పటికే బొబ్బిలి పోలీసు డివిజన్ పరిధిలో 10 కేసులు నమోదు చేశామని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం అతను తెర్లాం పోలీసుస్టేషన్‌ను పరిశీలించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు, ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది గౌరవ భావంతో మెలగాలని ఆదేశాలిచ్చామని చెప్పారు. సీఐ నారాయణరావు, ఎస్సై సాగర్‌బాబు, ఏఎస్సై మల్లీశ్వరరావు తదితరులు ఉన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రామవరంలో సమస్యల సావాసం



గంట్యాడ మండలం రామవరంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అధ్వాన రహదారులు, వెలగని విద్యుత్తు దీపాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చౌకధరల దుకాణం వీధిలో కాలువలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రహదారిపై పారుతోంది. రాత్రివేళల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. కాలువలు నిర్మించాలని, వీధిదీపాలు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ బానోజీ రావు మాట్లాడుతూ.. సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

యువ రైతులకు అవగాహన

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి వేణుగోపాల స్వామి కల్యాణ మండపం జిల్లాలోని పలువురు యువ రైతులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ పాలేకర్ కృషి (ఎస్‌పీకే) ప్రభాకర్ స్వామిజీ మాట్లాడుతూ.. ధార్మిక జీవనం లేనప్పుడు ప్రకృతి నశిస్తుందని, విపత్తులకు మనమే కారణమన్నారు. ప్రతి ఒక్కరూ పాలేకర్ సేద్యాన్ని అనుసరించాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి శిక్షణా కార్యక్రమం హైదరాబాదులో జరగనుందని ఎస్‌పీకే సాధకులు విజయరాయ్ అన్నారు. సేద్యంలో ఎకరాకు రూ.3 నుంచి రూ.5 లక్షలు సంపాదించే రైతులు ఉన్నారన్నారు. అయిదు విధానాల్లో సాగు చేపడితే లాభసాటిగా ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ.. తాను సేంద్రియ సాగు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రకృతి సేద్యానికి తన వంతు సహకారం అందజేయనున్నట్లు తెలిపారు. ఉత్పత్తుల స్టాల్‌ను కూడా ఏర్పాటుచేశారు.

ఒకే విద్యావిధానం అమలు చేయాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కన్వీనర్

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఒకే దేశం ఒకే విద్యావిధానం అమలు చేయాలని ఏపీటీఎఫ్ అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం అంతటా వర్తించే కామన్ పాఠశాల విధానాన్ని తీసుకురావాలని డిమాండు చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి తప్పించాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు జోగినాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మ, జిల్లా కార్యదర్శి పీటర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులు

సంతకవిటి, బొబ్బిలి, న్యూస్‌టుడే: సిరిపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.జ్యోత్స్న, కె.శ్రీలత, ఆర్.స్వాతి, డి.జ్యోత్స్న రాష్ట్రస్థాయిలో ఈ నెల 5, 6 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించే సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం వి.వెంకటరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.సన్నిబాబు, బుజ్జి తెలిపారు. ● చిత్తూరు జిల్లా తిరుపతిలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు ఎంపికయ్యారు. వారిని ఎమ్మెల్యే బేబినాయన శుక్రవారం అభినందించారు. బి.వరలక్ష్మి, డి.ఆదిత్య, సోమేశ్, యాదవ్, ఎస్.శివరామకృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు.

నడవలేం.. వాహనాలు నడపలేం



బొబ్బిలి మండలంలోని గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏపీఆర్ఆర్‌పీ పథకంలో డొంగురువలస మీదుగా మోసూరువలస వరకు తారు రహదారి వేయడానికి వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారుడు సగంలో వదిలేశాడు. వేసిన రాళ్లు తేలిపోయాయి. నడిచి వెళ్తే కాలుకు రాళ్లు గుచ్చుకుంటున్నాయని, వాహనాలపై వెళ్తే పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కేశాయవలస రహదారి కూడా సగంలో ఆగిపోయింది. అటవీశాఖ పరిధిలో భూమి ఉండడంతో అనుమతులు రాకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయింది. వర్షం పడితే పరిస్థితి ఘోరం. రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఏఈ రుగ్మాందనాయుడు తెలిపారు.

– న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

భూముల వివాదాలపై విచారణ

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశిందొరవలస పంచాయతీ పరిధిలోని డొంగురువలస రెవెన్యూ పరిధిలో చాలా ఏళ్ల కిందట పేదలకు ఇచ్చిన భూముల వివాదంపై తహసీల్దారు శ్రీను శుక్రవారం విచారణ చేపట్టారు. 1976లో కాశిందొరవలస, నారాయణప్పవలస, చిలకమ్మవలస గ్రామాలకు చెందిన పేదలకు భూమి ఇచ్చారు. కొన్నేళ్ల తరువాత అదే భూమిని పారాది ఎస్సీలకు కూడా ఇచ్చారు. దీంతో ఇరు వర్గాల మధ్య చాలా కాలంగా వివాదం నడుస్తోంది. సమస్య ఎమ్మెల్యే బేబినాయన వద్దకు రావడంతో పరిష్కరించాలని తహసీల్దారుకు సూచించారు. దీంతో ఆయన వెళ్లి పరిశీలించి, అక్కడి వారితో మాట్లాడారు. నిమ్మలపాడు రెవెన్యూలో వివాదంలో ఉన్న భూమినీ పరిశీలించారు. నివేదికను కలెక్టరుకు అందజేయనున్నట్లు తహసీల్దారు తెలిపారు.

అవీ..ఇవీ..అన్నీ

ఇసుక లారీ సీజ్

వంగర: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీను పోలీసులు తలగాం సమీపంలో పట్టుకొని సీజ్ చేశారు. రాత్రివేళల్లో తరలిస్తున్నారని తెలియడంతో నిఘా పెట్టి పట్టుకున్నట్లు ఎస్సై షేక్‌శంకర్ తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బొబ్బిలి, గ్రామీణం: పారాది వద్ద వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు టాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

28 మద్యం సీసాల స్వాధీనం

బొబ్బిలి, గ్రామీణం: మండలంలోని సీహెచ్ బొడ్డవలస చెందిన ఓ వ్యక్తి అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తుండగా పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. 28 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

పేదలకు ఆధునిక వైద్య సేవలు

రాజాం: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని వైద్యాధికారి డా. కిరణ్‌కుమార్ అన్నారు. రాజాం మున్సిపాల్టీ పరిధిలోని తిమ్మయ్యపేటలో వైద్య శిబిరం నిర్వహించారు.

పదేళ్ల జైలు

న్యాయవార్తావిభాగం, నెల్లిమర్ల: ఎస్సీ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష పడింది. నెల్లిమర్ల మండలం ఏటీ అగ్రహానికి చెందిన చెందిన అప్పలనాయుడు బొండపల్లి ప్రాంతానికి చెందిన బాధితురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేశాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేయగా.. జైలు శిక్షతో పాటు రూ.9వేల జరిమానా విధిస్తూ తీర్పు వచ్చినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

దేవీ అలంకరణలో చిన్నారులు



బొండపల్లి: మండలంలోని గొట్లాం గాయత్రీ టెక్నో స్కూల్‌లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా దేవీ అలంకరణలో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

బొండపల్లి, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం బొండపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బోడసింగిపేటలో నివాసముంటున్న సూర్యనారాయణ (51) కొద్ది రోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. సమీపంలోని ఓ పాఠశాలలో ఉరేసుకున్నాడు. భార్య తిరుమలరాజు రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ ప్రసాదంపై జరుగుతున్న ప్రచారంపై వాస్తవాలు వెలికి తీయడానికి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో స్వతంత్ర దర్యాప్తు సంస్థతో ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శుక్రవారం నగరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

రామతీర్థం కూడలిలో హైమాస్ట్ దీపాలు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల నగర పంచాయతీ రామతీర్థం కూడలిలో హైమాస్ట్ విద్యుత్తు దీపాలను శుక్రవారం ఏర్పాటు చేశారు. విద్యుత్తు దీపాల ఏర్పాటు పనులను కమిషనరు కె.అప్పలరాజు పరిశీలించారు. మొయిద కూడలిలో విద్యుత్తు దీపాల ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు.

చట్టం పరిధిలో సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి వాణి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: సమస్య వచ్చినపుడు, అన్యాయం జరిగినపుడు వాటిని ఎదిరించడానికి ధైర్యంగా చట్టాన్ని వినియోగించుకున్నపుడే నిజమైన మహిళా సాధికారత చేకూరినట్లని శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ ఛైర్‌పర్సన్ సబ్బవరపు వాణి అన్నారు. శుక్రవారం ఉదయం మండల పరిషత్తు కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవా అధికార సంస్థల సమన్వయంతో 'చట్టం ద్వారా పరిష్కారం' అనే అంశంపై మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించి అనేక చట్టాలు అమల్లో ఉన్నా.. వాటిని సద్వినియోగపర్చుకొనే విధానంలో మహిళలు ఇంకా వెనుకబడే ఉన్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం, మహిళలకు జరుగుతున్న అన్యాయాల మీద, మానవ అక్రమ రవాణా, వరకట్న వేధింపులు, క్రూరత్వం, మహిళల సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వన్ స్టాప్ సెంటరు అడ్మినిస్ట్రేటర్ పి.సాయి విజయలక్ష్మి, విజయనగరం న్యాయవాది ఏవీఎల్ పద్మజ రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు. ఐసీడీఎస్ పీవో ఎం.ఉమ, కార్మికశాఖ సహాయ అధికారి కె.కిరణ్‌చంద్ర, ఈవోపీఆర్డీ ఏవీ లక్ష్మి, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

ఆరోగ్య సేవలు అందేదెప్పుడో?

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు 3 లక్షల మంది ప్రజలు నివాసముంటున్నారు. రోజూ వివిధ అవసరాల నిమిత్తం నగరానికి 40 వేల మంది వరకు వస్తుంటారు. వీరందరికీ మహారాజా, ఘోషా, ఇతర చిన్న ఆసుపత్రుల నుంచి మాత్రమే వైద్య సేవలు అందుతున్నాయి. పట్టణ ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి వస్తే మరింత మందికి లబ్ధి చేకూరుతుంది. అయితే గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ నిర్మాణ పనులు ముందుకు కదలడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. పునాదులకే పరిమితం కావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఏడు కేంద్రాల మంజూరు..

నగరంలో ఏడు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఈమేరకు రూ.80 లక్షల చొప్పున రూ.5.60 కోట్లు మంజూరు చేశారు. నగర పాలక సంస్థ నుంచి అదనంగా రూ.1.62 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సొమ్మును కేఎల్‌పురంలోని నిర్మాణానికి రూ.21.73 లక్షలు, ప్రశాంతినగర్- రూ.20.15 లక్షలు, వీటీ అగ్రహారం- రూ.25.84 లక్షలు, ఎల్‌బీనగర్- రూ.23 లక్షలు, కొత్తపేట- రూ.24.22 లక్షలు, స్టేడియంపేట- రూ.23.21 లక్షలు, గాజులరేగలో ఏర్పాటుకు రూ.23.91 లక్షలు కేటాయించారు. ప్రస్తుతం కొత్తపేట, గాజులరేగ, వీటీఅగ్రహారంలో మాత్రమే పూర్తి చేశారు. స్టేడియంపేట, ప్రశాంతినగర్‌లో నిర్మాణ దశలో ఉండగా, కేఎల్‌పురం, ఎల్‌బీ కాలనీలో ప్రారంభోత్సవాలు జరిగినా వినియోగంలోకి రాలేదు.



ప్రశాంతినగర్‌లో తుప్పల మధ్య పట్టణ ఆరోగ్య కేంద్రం పునాదులు

ఇదీ పరిస్థితి..

ప్రశాంతినగర్ (ఇస్మాయిల్ కాలనీ)లో పనుల పూర్తికి సాధారణ నిధుల నుంచి రూ.35 లక్షలు మంజూరు చేయాలని, కొత్తగా టెండర్లు పిలవాలని ఇటీవల జరిగిన సాధారణ సమావేశంలో సభ్యులు లేవనెత్తారు. ఈమేరకు అజెండాలో అంశంగా చేర్చారు. ఏడు కేంద్రాల్లో గత ప్రభుత్వ హయాంలో ఇక్కడి నిర్మాణానికే తొలుత శంకుస్థాపన జరిగింది. నాలుగేళ్లవుతున్నా ఇంకా పూర్తికాలేదు.

చర్యలు తీసుకుంటాం..

స్టేడియంపేటలో నిర్మాణానికి కొత్తగా టెండర్లు పిలిచి గుత్తేదారుకు వర్క్ ఆర్డరు ఇచ్చాం. పనులు ప్రారంభించకపోవడంతో నోటీసు కూడా అందించాం. ప్రశాంతి నగర్‌లో ప్రారంభానికి మరో రూ.35 లక్షలు అవసరమని భావిస్తున్నాం. కేఎల్‌పురం, ఎల్‌బీ కాలనీల్లో త్వరలోనే సేవలు అందేలా చూస్తాం.

- కె.శ్రీనివాసరావు, ఈఈ, నగర పాలక సంస్థ

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	80085 74319

? రాజాపులోవలో ఎగువ వీధి నుంచి మురుగు నీరు ప్రధాన రహదారిపైకి వస్తోంది. - చిన్నారావు, స్థానికుడు

● తక్షణమే సమస్యను పరిష్కరిస్తాను. - విపిన్‌చంద్ర, కార్యదర్శి

– న్యూస్‌టుడే, భోగాపురం

? తలారి గ్రామంలో ప్రధాన రహదారిపై మూడు చోట్ల ప్రమాదకర గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు

● ర.భ. శాఖకు చెందిన ఈ రహదారిపై గోతులను పూడ్చడానికి చర్యలు తీసుకుంటాను - జి.జ్యోతిరత్నం, సర్పంచి, తలారి

–న్యూస్‌టుడే, లక్కవరపుకోట

? వెంకటేశ్వర కాలనీలో రహదారులు లేవు. - ఏపీటీ.దొర, స్థానికుడు

● నిధుల లభ్యత మేరకు రోడ్లు నిర్మిస్తాం. - పి.నల్లనయ్య, కమిషనర్

? కామాక్షినగర్, పీఎస్ఆర్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - స్థానికులు

● పరిశీలించి, బాగుచేయిస్తాం.

- ఎస్.అప్పారావు, డీఈఈ, నగరపాలక సంస్థ

–న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

దీపాలు వెలిగాయ్..

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: నగరంలోని మహాలక్ష్మినగర్, శ్రీనగర్ కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను డీఈఈ ఎస్.అప్పారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

వ్యర్థాల తొలగింపు

విజయనగరం పట్టణం: నగరపాలిక పరిధిలోని బాలాజీనగర్ దారిలో డంపర్ బిన్ అధ్వానంగా మారిందని, దాని పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని ఈనెల 4న 'ఈనాడు'లో 'చెత్త కదలదు.. దుర్వాసన తప్పదు' శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధించి అధికారులు స్పందించారు. శుక్రవారం కార్మికులతో చెత్తను తొలగింపజేశారు.

మా ఊరికి దారేదీ?



భోగాపురం మండలంలోని చోడిపిల్లిపేటకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో స్థానికుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ముక్కాం పంచాయతీ కొండ్రాజుపాలెం నుంచి ఈ గ్రామానికి చేరుకునేందుకు సుమారు రెండు కిలోమీటర్లు ఉంటుంది. సరైన రహదారి మార్గం లేక బురదలోనే వీరి ప్రయాణం కొనసాగించాల్సి వస్తోంది. వర్షం పడితే ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది. అధికారులు ఇటు వచ్చి వెళుతున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. దీనిపై ఎంపీడీవో కిశోర్‌కుమార్‌ను వివరణ కోరగా.. పరిశీలించి పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

– న్యూస్‌టుడే, భోగాపురం


సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈపీడీసీఎల్ అధికారులతో కలిసి అవగాహన కల్పించారు. ఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ సౌర విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని, వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈఈ పి.త్రినాథరావు, డీఈలు ఎ.కిరణ్‌కుమార్, టీవీఎస్ సింహాచలం, సీఎంఎం సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనరు నల్లనయ్య

సీఎం దృష్టికి ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు



హృదయరాజుకు వినతిపత్రం అందజేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎంటీఎస్ ఉపాధ్యాయులు(1998 డీఎస్సీ) సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్లాలని 1998 డీఎస్సీ అభ్యర్థులు కోరారు. విజయనగరంలో 6, 7, 8వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహాసభల్లో సమస్యలపై చర్చించాలని కోరుతూ శుక్రవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజుకు వినతిపత్రం అందజేశారు. ఎంటీఎస్ సంఘం నాయకులు పి.వెంకటరావు, ఎం.అప్పలరాజు, లక్ష్మణరావు, గోపీనాథ్, సి.హెచ్.వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్‌యూబీ గోడపై వర్ణ చిత్రాలు

కొత్తవలసలోని పరిమిత ఎత్తు భూగర్భ వంతెన (ఆర్‌యూబీ) గోడలను రైల్వే కనులవిందుగా తీర్చిదిద్దుతోంది. ఇందులో భాగంగా ప్రేరణ కలిగించే చిత్రాలను వేయిస్తోంది. ఆర్‌యూబీ గోడపై వర్షపు నీటి సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత అంశాలకు సంబంధించిన చిత్రాలను ఇప్పటికే తీర్చిదిద్దారు. ఆర్‌యూబీ పొడవునా ప్రజల్ని ఆలోచింపజేసే వివిధ చిత్రాలు వేయడానికి పనులు చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, కొత్తవలస



నేడు మెగా జాబ్ మేళా

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం 15 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రధానాచారిణి ఎం.వి.సాయిదేవమణి తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 9 గంటలకు ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రావాలన్నారు.

యువకుడి అదృశ్యం

భోగాపురం, న్యూస్‌టుడే: ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. ముంజేరుకు చెందిన ఏలూరు కనకరాజు గురువారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కొన్ని నెలల క్రితం కుమారుడికి అనారోగ్యానికి రూ.15 లక్షలకు పైగా అప్పు చేసి, చికిత్స చేయించారు. అప్పులు తీర్చాలని పెరుగుతున్న ఒత్తిడిని చూసి, మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రభాకరరావు తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: స్థల వివాదానికి సంబంధించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎస్.కొండబాబు తెలిపారు. మండలంలోని స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా యాజమాన్యం తమ భూభాగంలో కార్మికులతో కంచె వేయిస్తుండగా.. ఆ భూమి తమదని, కంచె వేయడానికి వీల్లేదని మల్లివీడుకు చెందిన వెంకటరావు పనులను అడ్డుకున్నారు. కర్మాగార మేనేజరు కామునూరి బాలకృష్ణ చెప్పినా వినిపించుకోకుండా మరో ముగ్గురిని తీసుకువచ్చి కార్మికులపై దౌర్జన్యం చేశారు. మేనేజరు బాలకృష్ణ ఫిర్యాదు మేరకు ఆదిరెడ్డి వెంకటరావు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అట్రాసిటీ కేసులో పదేళ్ల జైలు

న్యాయవార్తావిభాగం, నెల్లిమర్ల: ఎస్సీ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష పడింది. నెల్లిమర్ల మండలం ఏటీఅగ్రహానికి చెందిన చెందిన అప్పలనాయుడు బొండపల్లి ప్రాంతానికి చెందిన బాధితురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేశాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేయగా.. ఈమేరకు జైలు శిక్షతో పాటు రూ.9 వేల జరిమానా విధిస్తూ తీర్పు వచ్చినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం కంటోన్మెంట్, అర్బన్, గ్రామీణం, రింగురోడ్డు, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం రైల్వేస్టేషన్ వనం గుడిలో ఉన్న దుర్గాదేవి గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ★ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ★ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ధర్మపురి పెద్దవీధిలో కొలువుదీరిన తల్లి పూజలు చేశారు. ★ పోలీసు బ్యారెక్స్‌లోని దండుమారమ్మ ఆలయంలో ఎస్పీ వకుల్ జిందాల్, కమాండెంట్ మలికా గార్గ్ దంపతులు పూజలు చేశారు. ★ శృంగవరపుకోట దుర్గాదేవీ ఆలయంలో శుక్రవారం గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



గాయత్రీదేవిగా దుర్గాలమ్మ



దండుమారమ్మ ఆలయంలో ఎస్పీ దంపతులు

జామి కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గాదేవిని కలువ పువ్వులతో అలంకరించి పూజలు చేశారు. అలమండలో అమ్మవారిని గాయత్రిమాతగా అలంకరించారు.

హక్కులపై అవగాహన అవసరం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: దేశ రాజ్యాంగం, హక్కులపై నేటితరం విద్యార్థులు, యువతకు అవగాహన అవసరమని జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఆర్.కృష్ణాజీ సూచించారు.. శుక్రవారం నగరంలోని ఎస్ఎస్‌జే కళాశాలలో జరిగిన చైతన్య సభలో ఆయన మాట్లాడారు. పేదరికం అనే మహమ్మారిని తరిమికొట్టాలంటే చదువొక్కటే సరైన మార్గమన్నారు. విద్యార్థి దశలోనే ఉజ్వల భవితకు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. జేవీవీ జాతీయ కార్యదర్శి పి.రమేష్‌రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణాజీ

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



వెంకట్ కుటుంబానికి నగదు అందజేస్తున్న గ్రామపెద్దలు



సత్యవతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న అట్టాడ యువత

నెల్లిమర్ల, జామి, న్యూస్‌టుడే: జరజాపుపేట ప్రాంతానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు బి.వెంకట్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామస్థులు, గ్రామ పెద్దల సహకారంతో రూ.లక్ష నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. నగర పంచాయతీ ఉపాధ్యక్షుడు సముద్రపు రామారావు, గ్రామ పెద్దలు ఎం.ఎం.నాయుడు, అవనాపు సత్యనారాయణ, నల్లి శేఖర్, బోని వెంకటరమణ, అవనాపు మురళీ, కనకల రాము తదితరులు పాల్గొన్నారు. ● జామి మండలంలోని అట్టాడలో పేదకుటుంబానికి గామానికి చెందిన రామసేన యువత రూ.50,910 సేకరించి శుక్రవారం ఆర్థిక సహాయం చేసింది. 12 ఏళ్ల కిందట భర్తను, ఇటీవల పెద్దకొడుకు డిల్లీశ్వరరావును కోల్పోయిన సత్యవతి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామానికి చెందిన యువకులు సంకల్పించి ఆర్థిక సాయం అందజేశారు.

శాప్ ఛైర్మన్‌ను కలిసిన తెలుగుయువత



విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ(శాప్) ఛైర్మన్‌గా నియమితులైన ఎ.రవినాయుడిని శుక్రవారం విజయవాడలో విజయనగరం పార్లమెంటరీ యువత నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గొలగాన రవీంద్ర, పొగిరి పైడిరాజు,కుటుంబరావు, మద్దెలప్రవీణ్, పీల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

7న ప్రజాదర్బార్

శృంగవరపుకోట: ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా 7న ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమై అధికారులంతా ప్రజాదర్బార్‌కు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే లలితకుమారి సూచించారు.

భాజపా సభ్యత్వాల నమోదు

వేపాడ: మండలంలోని వల్లంపూడి, వేపాడ, దబ్బిరాజుపేట తదితర గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి భాజపా సభ్యత్వాలు నమోదుచేశారు. భాజపా మండలాధ్యక్షుడు గోకేడ మహేష్, నాయకులు దానేష్, షేక్ నూర్‌బాషా పాల్గొన్నారు.

వృత్తివిద్యలో విద్యార్థినులకు శిక్షణ

జామి: జామి జడ్పీ ఉన్నత పాఠశాల వృత్తివిద్య ఉపాధ్యాయుడు కె.అనిల్‌కుమార్ స్థానిక మోటారు మెకానిక్ దుకాణానికి విద్యార్థినులను తీసుకువెళ్లి పనితీరును ప్రత్యక్షంగా చూపించారు. ఎంఈవో జయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

వంతెన రహదారికి మరమ్మతులు

జామి: భీమసింగి వంతెన గోతులతో వాహనచోదకుల ఇబ్బందులు గమనించి జామి ఎస్ఐ జనార్దనరావు, తెదేపా నాయకులు బండారు పెదబాబు, పి.స్వామినాయుడు, ధనియాల పైడిరాజు శ్రమదానంతో గోతులు పూడ్చారు. జాతీయ రహదారి గుత్తేదారు సహకారంతో జేసీబీతో పనికిరాని మొక్కలను తొలగించారు.

సంక్షిప్త సమాచారం

నిత్యావసరాల పంపిణీ

అయ్యన్నపేట: ఎస్.కోటకు చెందిన చైల్డ్‌హుడ్ ఫ్రెండ్స్ గ్రూపు సభ్యులు అలకానంద కాలనీలోని పేదలకు శుక్రవారం నిత్యావసర సరకులను అందజేశారు. విజయనగరం డివిజనల్ పీఆర్వో జానకమ్మ, సైనిక బోర్డు విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ వి.వి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

విజయనగరం క్రీడలు: రాజీవ్ గాంధీ స్టేడియంలో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ అండర్- 14, 17 కరాటే జిల్లా జట్లకు బి.షణ్ముఖ, శ్రీకర్, ఆర్.గణేష్, కె.శివగణేష్, పి.హేమంత్, బి.రేష్వంత్, సమీర్ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల క్రీడల కార్యదర్శి కృష్ణంరాజు, శిక్షకుడు సంతోష్‌కుమార్ అభినందించారు.


ముగిసిన బ్యాడ్మింటన్ ఎంపికలు

శృంగవరపుకోట: పట్టణంలో పీఆర్ కోర్టులో శుక్రవారం నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో 20 మందిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు మండల క్రీడా సమన్వయకర్త పి.శ్రీరాములు తెలిపారు.

7 నుంచి ప్రవేశాలు

విజయనగరం విద్యావిభాగం: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 7 నుంచి 9వ తేదీల మధ్య స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రధానాచార్యుడు జి.జనార్దన నాయుడు తెలిపారు.

జడ్పీటీసీ మాజీ సభ్యుడి మృతి



జనార్దనరావు (పాత చిత్రం)

డెంకాడ: మండలంలోని మోపాడకు చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు బద్దుకొండ జనార్దనరావు (68) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఈయన భౌతిక కాయాన్ని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడుతో పాటు పలువురు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జలవనరుల శాఖ డీఈఈ బాధ్యతల స్వీకరణ



పి.శ్రీచరణ్, డీఈఈ

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: జలవనరులశాఖ డీఈఈగా పి.శ్రీచరణ్ బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం సబ్ డివిజన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంత వరకు డీఈఈగా పని చేసిన కె.రమణ విశాఖ సీఈ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఎల్.కోట సెక్షన్ (వేపాడ, ఎల్.కోట, కొత్తవలస) సహాయ ఇంజినీరుగా కె.హనుమంతరావు, ఎస్.కోట ఏఈగా శివరామకృష్ణ, జామి ఏఈగా సంతోష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారని ఆయన వివరించారు.

మండలాల్లో కొత్త ఎంపీడీవోలు

శృంగవరపుకోట, భోగాపురం, కొత్తవలస, వేపాడ, డెంకాడ, ఎల్.కోట, న్యూస్‌టుడే : శృంగవరపుకోట, భోగాపురం, కొత్తవలస, వేపాడ, డెంకాడ, ఎల్.కోట ఎంపీడీవోలుగా ఎం.సతీష్, కె.కిశోర్‌కుమార్, పి.సూర్యనారాయణ, వై.భవాని, అప్పారావు, డెంకాడ, వేపాడ వెలుగు కార్యాలయ ఏపీఎంలుగా వి.శ్రీనివాసరావు, సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్తు, తహసీల్దారు కార్యాలయాల్లో ని సిబ్బందికి బదిలీ కాగా కొత్తవారు విధుల్లో చేరారు.

కార్మికులను ఆదుకోవాలని డిమాండు

విజయనగరం అయ్యన్నపేట/మయూరి కూడలి, న్యూస్‌టుడే: ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి శంకర్రావు డిమాండు చేశారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉచిత ఇసుక కార్యక్రమాన్ని ప్రారంభించినా.. క్షేత్రస్థాయిలో దొరకడం లేదన్నారు. ఈ ప్రభావం నిర్మాణాలపై పడుతోందని చెప్పారు. నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, త్రినాథ్, శ్రీను పాల్గొన్నారు.

కల్యాణ మండపం పనుల పరిశీలన



నిర్మాణ ప్రగతిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలసలో తితిదే మంజూరుచేసిన కల్యాణ మండప నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. రెల్లికి వెళ్లే రోడ్డులో డ్రైవర్ల కాలనీకి ఎదురుగా నిర్మిస్తున్న కల్యాణ మండపం పనుల్ని గురువారం పొద్దుపోయాక ఆమె పరిశీలించారు. తహసీల్దారు బి.నీలకంఠరావును కోరారు. పనులు సాధ్యమైనంత తొందర్లో పూర్తి చేయించాలని సైట్ ఇన్‌ఛార్జికి తెలియజేశారు.

సమాజాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



ముఖ్యులతో బహుమతులు అందుకున్న విద్యార్థులు

కొత్తవలస, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆంధ్రా విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య డా.వెలగపూడి ఉమామహేశ్వరరావు, పీజీ, ప్రొఫెషనల్ ఎగ్జామినేషన్ విశ్రాంత డీన్ ఆచార్య కెంబూరి చంద్రమౌళి సూచించారు. తుమ్మికాపల్లిలోని వాగ్దేవి డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన స్వాగత దినోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. జాతీయస్థాయి 'లాక్రోజ' పోటీల్లో ప్రథమస్థానం సాధించిన ఎల్.నవీన్, జాతీయస్థాయి మహిళ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన యు.పల్లవిని అభినందించి ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు, సంచాలకులు సీహెచ్.ప్రవీణ్, కుమార్‌బాబు, అప్పారావు, ప్రిన్సిపాళ్లు లక్ష్మణరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో దుష్పరిణామాలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగంతో అనేక రకాల దుష్పరిణామాలు ఎదురవుతాయని సీఐ వి.నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగించిన వారిపై ఎన్‌డీపీఎస్ చట్టాల ప్రకారం చర్యలుంటాయని వివరించారు. ఈ చట్టాల గురించి పవర్ పాయింటు ప్రజెంటేషన్, వీడియోలు, కరపత్రాలు, ఫ్లెక్సీల ద్వారా అవగాహన కల్పించారు. యాంటీ డ్రగ్స్ కమిటీ, ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. ఎస్ఐలు భాస్కరరావు, గంగరాజు, ప్రిన్సిపల్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణమూర్తి

ఏపీటీఎఫ్ మహాసభల విజయవంతానికి పిలుపు



నెల్లిమర్లలో గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఏపీటీఎఫ్ నాయకులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో పూల్‌బాగ్ వద్ద జగన్నాథ కల్యాణ మండపంలో 6 నుంచి నిర్వహించనున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు కోరారు. శుక్రవారం నెల్లిమర్ల విద్యావనరుల కేంద్రం వద్ద మహాసభల గోడ ప్రతులను ఆవిష్కరించి విలేకర్లతో మాట్లాడుతూ ఏపీటీఎఫ్ 80 వసంతాల సందర్భంగా 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు బలరామ్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమితో దేవాలయాల అభివృద్ధి సాధ్యం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెదేపా విజయనగరం పార్లమెంటరీ బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షుడు రాకేష్ శర్మ అన్నారు. విజయనగరంలోని అశోక్‌బంగ్లాలో శుక్రవారం జిల్లా కమిటీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ధూపదీప నైవేద్యం పథకం కింద రూ.10 వేల మొత్తాన్ని అందించేందుకు నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమన్నారు. మార్ల రవికుమార్, ద్వారక వాసు, వడ్లమాని శేఖర్, సుభద్ర, నాంధగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాకేష్‌శర్మ